## స్కూల్ బ్యాగ్‌లు అందజేత



విద్యార్థులతో హెచ్‌ఎం, క్లబ్ సభ్యులు

వైరారూరల్, నవంబర్ 3: మండలంలోని తాటిపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ వైరా ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు, హెచ్‌ఎం పెనుగొండ ఉపేందర్‌రావు శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పర్పుల్ డీఎన్‌ఏ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను చదువులో ప్రోత్సాహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సాయిరాం మెడికల్ అధినేత సీహెచ్ బద్రీనాద్, పంచాయతీ కార్యదర్శి వేణు, అంగన్‌వాడీ టీచర్లు శారద, రాణి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

కారేపల్లి, నవంబర్ 3: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఏనుగు జోగయ్య కుటుంబానికి వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, బానోత్ మదన్‌లాల్ శుక్రవారం ఆర్థిక సాయాన్ని నాయకుల ద్వారా అందజేశారు. కుటుంబ సభ్యులతో మదన్‌లాల్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ తోపాటు తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నాయకులు తాతా వెంకన్న, రవీందర్‌రెడ్డి, దాసు, వడ్డె రమేశ్, తాతా ఉపేందర్, కోసం నాగయ్య పాల్గొన్నారు.

## ముగ్గురిపై మద్యం కేసులు నమోదు

కారేపల్లి, నవంబర్ 3: మండలంలోని జైత్రాం తండా మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నాటు సారాను తరలిస్తున్న దంపతులు బాలు, అరుణలను పక్కా సమాచారంతో శుక్రవారం పట్టుకొని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఝుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. అదే విధంగా సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లోని బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 125 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటు సారా తయారు చేసిన, అమ్మినా వెంటనే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## కడసారి చూపునకు వచ్చింది.. ఆపై కన్నుమూసింది.

వేంసూరు, నవంబర్ 3: మేనత్తను కడసారి చూసేందుకునేందుకు వచ్చిన మేనకోడలు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన వేంసూరు అంబేద్కర్‌కాలనీలో శుక్రవారం జరిగింది. వేంసూరు గ్రామానికి చెందిన రామాల విజయకుమారి (55) గురువారం గుండెపోటుతో మరణించింది ఆమెను చివరిసారిగా చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన రామాల రవికుమార్, రామాల సునీత దంపతులు వచ్చారు. విజయకుమారి మేనత్త కాగా.. రామాల సునీత (45) మేన కోడలు. విజయకుమారి భౌతికకాయాన్ని చూసి రోదిస్తున్న క్రమంలో సునీత కూడా గుండెపోటు గురింది. దీంతో అక్కడే కుప్పకూలింది. కుటుంబ సభ్యులు ఆమెను సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాలనీకి చెందిన మేనత్త, మేన కోడళ్లు గుండెపోటుతో ఒకరోజు వ్యవధిలో మరణించడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రామాల సునీతకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# మదన్‌లాల్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం





వైరాటౌన్: 4వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, వైరా రూరల్: గరికపాడులో నాయకులు, కార్యకర్తలు

వైరాటౌన్, నవంబర్ 3: వైరా మున్సిపాలిటీ పరిధిలోని మాటూరిపేట నాల్గోవ వార్డులో బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపు కోసం కొత్తా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదన్‌లాల్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని, ఒక్కో కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**గరికపాడులో..**

వైరారూరల్, నవంబర్ 3: వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని గరికపాడు గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, మ్యానిఫెస్టోలోని అంశాలను ఓటర్లను వివరిస్తున్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారని, గ్రామాల్లో కేసీఆర్‌కు తప్ప ఎవ్వరికి మద్దతు తెలపమని చెబుతున్నారని పేర్కొన్నారు. కారుగుర్తుపై ఓటు వేసి మదన్‌లాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐలూరు శ్రీనివాసరెడ్డి, బిల్లా నర్సింహారావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, సందీప్, తేలూర్ నాగరాజు, పంతంగి శ్రీనివాసరావు, అరగల యాకోబు, కోట ఆదియ్య, బొల్లిపోగు శ్రీను, కొరకు ఏసు, పంతంగి తిరుపతిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో తనికెళ్ల విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, నవంబర్ 3: గత నెల 29న జరిగిన జిల్లా స్థాయి జోడో పోటీల ఎంపికల్లో మండలంలోని తనికెళ్ల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు ఐదుగురు బాలికలు, నలుగురు బాలురు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 1, 2 తేదీల్లో హన్మకొండలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి పాఠశాలల జోడో పోటీల్లో 2.3 కేజీ విభాగంలో ఎం శ్రీజ, 36 కేజీల విభాగంలో ఏ సుస్మిత, 40 కేజీల విభాగంలో ఎం మన్విత‌ప్రియదర్శిణి తృతీయస్థానం సాధించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం డీ అబ్రహం, పీడీ దొండపాటి శ్రీనివాస్, విద్యార్థులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సురేశ్, లక్ష్మీనారాయణ, జనార్ధన్, వెంకటేశ్వర్లు, నాగమణి, లక్ష్మీప్రియ, సునీత, రాజారత్నం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

# ఖమ్మం రైల్వే స్టేషన్‌లో 21 కేజీల గంజాయి స్వాధీనం

మామిళ్లగూడెం, నవంబర్ 3: జిల్లా ఎక్సైజ్ అధికారి జీ నాగేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం-2 బయట శుక్రవారం నిర్వహించిన తనిఖీలలో బీహార్‌కి చెందిన అఖియాకుమార్ నాయక్ వద్ద సుమారు 21 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ-2 రాజిరెడ్డి తెలిపారు. విశాఖపట్నం చుట్టు ప్రక్కల నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో నిందితుడు తెలిపాడని అన్నారు. గంజాయి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్సైలు ఎం సరిత, పీ సందీప్‌రావు, సిబ్బంది నాయక్, నరేందర్, మౌలంకార్, నర్సింహా, వీరభద్రం, గురుప్రసాద్, చెన్నమ్మ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారులు

### మద్యం అక్రమంగా నిల్వ చేసినా, అమ్మినా సమాచారమివ్వండి

ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం-2 పరిధిలో మద్యం అక్రమంగా నిల్వ చేసినా, అమ్మినా, గుడుంబా తయారీ చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4252523 సమాచారం ఇవ్వాలని సీఐ రాజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా వెరిట్ యాప్ ఉపయోగించి మద్యం బాటిల్స్ స్కాన్ చేసి డ్యూటీ చెల్లించిన మద్యమా, అక్రమ మద్యమా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అక్రమ మద్యం అయితే వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ పరిధిలో అక్టోబర్ 9 నుంచి 31 వరకు 79మందిపై 112 కేసులు నమోదు చేశామని, 31 లీటర్ల గుడుంబా, 492 లీటర్ల మద్యం, 118 కేజీల గంజాయి సీజ్ చేయడంతో పాటు 15,350 లీటర్ల బెల్లం పానకం, 260 లీటర్ల కల్లును ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఖమ్మం వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో బీహార్‌కు చెందిన కేశవ్ ప్రదాన్ అనే వ్యక్తి నుంచి 13కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.25 లక్షల వరకు ఉంటుందన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

వేంసూరు, నవంబర్ 3: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఖమ్మం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జీ.జనార్ధన్‌రెడ్డి, డీపీఈజీ జీ.నాగేంద్రరెడ్డి సత్తుపల్లి సరిహద్దు ప్రాంతాల్లోని మెడిశెట్టివారిపాలెం, వెంకటాపురం, ముత్తగూడెం, పేరువంచ చెక్‌పోస్టులను శుక్రవారం సందర్శించి తనిఖీలు చేశారు. అక్రమ మద్యం రవాణ నివారణకై సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ మద్యం కలిగి ఉన్న రవాణా చేసినా, నాఆటు సారాయి అమ్మకం, తయారీ లేదా తయారీ కొరకు ఉపయోగించిన ముడి పదార్థాలు సరఫరా చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీ.రాజశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు



బందోబస్త్ నిర్వహిస్తున్న వైరా ఏసీపీ రహమాన్, ఎస్సై మేడా ప్రసాద్

వైరాటౌన్, నవంబర్ 3: ఈ నెల 30వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వైరా ఏసీపీ రమమాన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్త్ నిర్వహించారు. తొలిరోజు ఎలాంటి నామినేషన్‌లు దాఖలు కాలేదు. వైరా రిటర్నింగ్ ఆఫీసర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో పోలీస్ బందోబస్త్ నిర్వహిస్తున్నామన్నారు. సంబంధిత అభ్యర్థులు ఒక్కొక్కరు ఐదు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రతి కార్యక్రమం కెమెరా నిఘాలో ఉంటుందని, అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. వైరా సీఐ సాగర్, ఎస్సై కొండలరావు, పారా మిలటరీ దళాలు పాల్గొన్నారు.

## కారేపల్లి క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కారేపల్లి, నవంబర్ 3: మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్సైలు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహారిపై వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకుల బ్యాగులు, సంచులను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే తప్పని సరిగా అందుకు సంబంధించిన ఆధారాలు ఉండాలని లేకుంటే డబ్బును సీజ్ చేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ సిబ్బందికి వాహనదారులు సహకరించాలని కోరారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఉరి వేసుకొని ప్రేమజంట ఆత్మహత్య

వైరా టౌన్, నవంబర్ 3: ఉరి వేసుకుని ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వైరా పట్టణ పరిధిలోని రిజర్వాయర్ ఆయకట్టులో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్లు మండలం రాపల్లికి చెందిన చింతల సుమంత్ (23), వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన దారగాని ఐశ్వర్య కొంతకాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ ఇటీవల ఇంటినుంచి వెళ్లిపోయారు. తర్వాత ఇరు కుటుంబాలు వారిద్దరి కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు బోనకల్లు పీఎస్‌లో మిస్సింగ్ కేసులు నమోదు చేశారు. ప్రేమజంట మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ గురువారం సాయంత్రం సుమంత్, ఐశ్వర్య బైక్‌పై వైరా రిజర్వాయర్ వద్దకు వచ్చి ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం ఉదయం స్థానిక రైతులు విగత జీవులుగా వేలాడుతున్న జంటను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని వైరా ఏసీపీ రెహమాన్, ఎస్సై మేడా ప్రసాద్ పరిశీలించారు. రెండు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, నవంబర్ 3: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం లింగాలకు చెందిన పందుల రాము (30) కొన్నేళ్ల క్రితం బతుకుదెరువుకు రఘునాథపాలేనికి వచ్చాడు. కూలి పనిచేసుకుంటూ గ్రీన్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. రోజూలాగానే శుక్రవారం తోటి కార్మికులతో రాము పనికి వెళ్లాడు. పనిచేస్తున్న సమయంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండల్‌రావు తెలిపారు.